సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 21 । జనవరి । 2025



వర్సిటీలపై నిఘా

వర్సిటీలపై కూటమి ప్రభుత్వం నిఘా పెడుతోంది. సొంత నిర్ణయాలు వద్దని ఆదేశాలు వచ్చాయి. - 8లో



దారి కాచిన మృత్యువు

వేర్వేరు చోట్ల జరిగిన రెండు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. కంచిలి, జి.సిగడాం మండలాల్లో ఘటనలు జరిగాయి. - 8లో

30 మందిపై బైండోవర్ కేసులు నమోదు

ఇచ్ఛాపురం రూరల్: మండలం బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన 30మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం బాలకృష్ణాపురం గ్రామానికి కొంత మంది వ్యక్తులు స్థానిక రైతులకు తెలియకుండా వారి భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారికి అమ్మకం చేసినట్లు వచ్చిన అభియోగం, ఆందోళన మేరకు గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

పంచాయతీ ఉద్యోగి చేతివాటం పై ఫిర్యాదు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించి పంచాయతీకి చెందాల్సిన సొమ్మును సొంత అవసరాలకు వినియోగించుకున్న వైనంపై వార్డు సభ్యుడు దాడి ధర్మారావు సోమవారం జిల్లా కేంద్రంలో గల అధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు అందజేశారు. ఈ మేరకు 'పంచాయతీ ఉద్యోగి చేతివాటం' అనే కథనం సాక్షిలో ప్రచురితమైన సంగతి తెలిసిందే. అయితే టెక్కలి మేజర్ పంచాయతీ కార్యాలయంలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఇంటి పన్నుల విషయంలో కొంత మంది సిబ్బంది పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యాలయంలో చాలా ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న కొంత మంది సిబ్బంది పూర్తిగా అక్రమ మార్గంలో డబ్బులు వసూలు చేస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఇంటర్ ప్రీ-ఫైనల్ పరీక్షలు ప్రారంభం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ యాజమాన్య జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రీ ఫైనల్ పరీక్షల్లో భాగంగా తొలిరోజు సోమవారం తెలుగు, సంస్కృతం, హిందీ పేపర్లకు పరీక్షలు రాశారు. 2024 ఇంటర్ బోర్డు పబ్లిక్ ప్రశ్న పత్రాల్లో మిగిలిన ఒక సెట్ ప్రశ్న పత్రాలను ఈ ప్రీ-ఫైనల్ పరీక్షలకు వినియోగిస్తున్నారు. సంక్రాంతి సెలవులు ముగిసిన తొలిరోజే ప్రీ-ఫైనల్ పరీక్షలు జరగడంతో 20 నుంచి 40 శాతం మంది వరకు విద్యార్థులు గైర్హాజరైనట్లు గుర్తించారు. సెలవులు ముగిసిన తొలిరోజు పరీక్షలు మొదలయ్యేటట్టు షెడ్యూల్‌ను తయారు చేయడం ఎంతమాత్రం సరికాదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ తీరును ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు సైతం తప్పుబడుతున్నారు.

యూపీఎల్‌సీ అభివృద్ధికి పేటెంట్ హక్కులు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడు బి.సతీష్‌కుమార్ బల్క్ డ్రగ్ పదార్థాల్లో సోనీడిగిబ్ దాని సేంద్రియ మలినాలను లెక్కించడానికి అల్ట్రా పెర్ఫార్మెన్స్ లిక్విడ్ క్రోమోటోగ్రఫీ సహాయక పద్ధతిపై చేసిన అభివృద్ధి ప్రక్రియకు ఇండియన్ పేటెంట్ హక్కులు పొందారు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. అధ్యాపకులు సతీష్‌కుమార్ అభివృద్ధి పరచిన రసాయన పద్ధతులకు తగిన గుర్తింపు రావడం పై ఎంతో సంతోషంగా ఉందంటూ ప్రిన్సిపాల్‌తో పాటు ఇతర సిబ్బంది అభినందించారు.

పురాతన విగ్రహాలు లభ్యం



బుద్ధుని విగ్రహాన్ని చూపిస్తున్న ఇంటాక్ బృందం

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామంలో పురాతన విగ్రహాలు కనిపిస్తున్నాయని ఇంటాక్ బృందం కన్వీనర్ నూకా సన్యాసిరావు, అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథనాయుడు, చింతాడ కృష్ణమోహన్‌లు తెలిపారు. ఇక్కడ పురాతన విగ్రహాలు కనిపిస్తున్నట్లు వెంకటాపురం గ్రామానికి చెందిన నెల్లి దాలినాయుడు ఇచ్చిన సమాచారం మేరకు సోమవారం ఇంటాక్ బృంద సభ్యులు బుడుమూరు గ్రామానికి వెళ్లి ఇక్కడ విగ్రహాలను పరిశీలించారు. ఇక్కడ కనిపిస్తున్న విగ్రహాలు బుద్ధుడి కాలం కంటే ముందువని, మారీచి అమ్మవారి విగ్రహం గ్రామం మధ్యలో ఉండడం విశేషమని అన్నారు. ఈ విగ్రహాన్ని స్థానికులు వమ్మరవల్లి అమ్మవారని పేర్కొంటున్నారని తెలిపారు. ఏనుగు మీద అమ్మవారు ఉన్న విగ్రహం బుద్ధుని కాలం కంటే ముందుదని చరిత్ర చెబుతోందన్నారు. కళింగుల కాలంలో ఉన్న విగ్రహాలు కూడా కొన్ని చిన్న చిన్నవి కనిపించాయని తెలిపారు. ఇటీవల గ్రామస్తులు ఇక్కడ దుర్గాదేవి ఆలయాన్ని నిర్మించారని, ఈ సందర్భంగా నాలుగైదు ప్రాచీన విగ్రహాలు బయటపడగా అందులో బుద్ధుని విగ్రహం ఉండటం గమనించామని తెలిపారు. తాము గమనించిన మేరకు గతంలో ఈ ప్రాంతమంతా కళింగ గంగుల పాలనలో ఉన్నట్లుగాను, అలాగే తదనంతరం బౌద్ధ సంస్కృతి ఆచారాలు, సంప్రదాయాలు ఇక్కడ వెల్లివిరిసినట్లు తెలుస్తోందన్నారు. విస్తృతంగా పరిశీలనలు జరిపితే ఈ ప్రాంతం చారిత్రక వైభవాన్ని తెలుసుకోవచ్చని, వీటి చిత్రాలను ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియాకు పంపించనున్నట్లు బృంద కన్వీనర్ నూకా సన్యాసిరావు తెలిపారు.

● ఊరెళ్లిపోదాం

సంక్రాంతికి సొంతూరుకు వచ్చిన వాళ్లు తిరిగి వెళ్లిపోతుండడంతో బస్, రైల్వేస్టేషన్లు రద్దీగా మారుతున్నాయి. ఆమదాలవలస రైల్వేస్టేషన్ సోమవారం జనంతో కిక్కిరిసిపోయింది. జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కూడా కిటకిటలాడింది. - ఆమదాలవలస, శ్రీకాకుళం అర్బన్



శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద జనం




శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు



ఆమదాలవలస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

రైతు భూమిలో రాబందులు





విశాఖకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి పేరున రిజిస్ట్రేషన్ అయిన బాలకృష్ణాపురం రైతుల వ్యవసాయ భూమి

- టీడీపీ నాయకులే పాత్రధారులు
- అడంగల్ సృష్టించి బినామీ పేర్లతో అమ్మకం
- ఆర్డీఓ రాకతో వెలుగులోకి కుంభకోణం
- తహసీల్దార్ కార్యాలయం వద్ద బాలకృష్ణాపురం రైతుల ఆందోళన

ఇచ్ఛాపురం రూరల్:

చదువు లేని వారి అమాయకత్వాన్ని ఆ గ్రామ సర్పంచ్ అలుసుగా తీసుకున్నాడు. డాక్యుమెంట్లు చదవలేని వారి బలహీనతను అదనుగా చేసుకుని మరో ఇద్దరితో కలిసి ఏకంగా ఆ రైతుల భూములకే ఎసరు పెట్టాడు. గుట్టు చప్పుడు కాకుండా విశాఖపట్నంకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి భూములు విక్రయించేశాడు. విషయం తెలుసుకున్న రైతులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. వివరాల్లోకి వెళితే..

శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన సర్వే నంబర్ 45, 46లో నాలుగు ఎకరాల 65 సెంట్లు వ్యవసాయ భూమిని వ్యవసాయేత భూమిగా మార్చుకునేందుకు అధికారులకు దరఖాస్తు వచ్చింది. ఆ దరఖాస్తు మేరకు ఆ భూమిని పరిశీలించేందుకు పలాస ఆర్డీఓ జి.వెంకటేష్, స్థానిక తహసీల్దార్ కె.వెంకటరావులు శనివారం బాలకృష్ణాపురం గ్రామానికి వెళ్లి పరిశీలించారు. విషయం తెలుసుకున్న గ్రామ రైతులు ఈ భూములు తమ తాతలు, ముత్తాతల నుంచి సాగు చేస్తున్న పంట భూములని, ఇతరులకు సంబంధం లేదంటూ విన్నవించారు. విశాఖపట్నంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి కాంట్రేగుల సంజీవ్ కుమార్‌కు బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన నూకల దాలమ్మ, ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన ఆశి సోమేశ్వరరావురెడ్డి, కవిటి మండలం బెజ్జిపుట్టుగ గ్రామానికి చెందిన బెందాళం జయప్రకాశ్‌లు భూములు అమ్మినట్లు రిజిస్ట్రేషన్ అయిన నేపథ్యంలో 'నాలా కన్వర్షన్' కోసం వచ్చినట్లు ఆర్డీఓ వెంకటేష్ చెప్పడంతో రైతులంతా హతాశుతులయ్యారు. ఇవి తమ భూములని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు సంబంధం లేదని రైతులు ఆర్డీఓ ఎదుట ఆందోళన చేయడంతో ఆయన వెనుదిరిగారు. తర్వాత బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు నూకల దాలమ్మను స్థానిక రైతులు ఆదివారం నిలదీయగా అసలు విషయం బట్టబయలైంది. తనకు సెంటు భూమి లేదని, స్థానిక సర్పంచ్ బతకల కుమారి వచ్చి 'మాకు చెందిన ఎకరం భూమి నీ పేరున తప్పుగా నమోదైంది. ఇచ్ఛాపురం వచ్చి సంతకం చేయాలి' అని చెప్పడంతో తాను వెళ్లి సంతకం చేశానని, అందుకు రేషన్ డీలర్ బోరుబద్ర లోహిదాసు, మండపల్లి కాన్వెంట్ ప్రిన్సిపాల్ కోట రామారావులు కూడా చెప్పారని, అంతకంటే తనకు ఏమీ తెలియదని చెప్పడంతో రైతులు అవాక్కయ్యారు. సోమవారం గ్రామానికి చెందిన సుమారు వంద మంది రైతులు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. తమ భూములు వెంటనే తమకు అప్పగించాలని తహసీల్దార్ ఎస్.వెంకటరావుకు వినతి పత్రం అందజేశారు.

నా భూమిని ఎలా అమ్మేస్తారు



నాకు చదువు రాదు. నీ భూమిని అమ్మేశారని మా పక్కింటివారు చెప్పడంతో నా గుండె జారిపోయింది. ఈ ఏడాది పంట వేసినప్పటికీ వర్షాలు లేకపోవడంతో పంట ఎండి పోయింది. భూమిని నమ్ముకొని జీవిస్తున్నాము. మా కడుపులు కొట్టొద్దు.

- బతకల దుర్గమ్మ, బాలకృష్ణాపురం

అసలు విషయం ఇదీ..

బాలకృష్ణాపురం గ్రామం పరిధిలో భూమి ఉందన్న విషయాన్ని గ్రహించిన విశాఖపట్నంకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి స్థానిక టీడీపీ నాయకులతో కలసి బేరసారాలు ఆడారు. రైతులు ససేమిరా అనడంతో కొంత మంది రైతులను మభ్యపెట్టి తమ దారికి తెచ్చుకున్నట్లు భోగట్టా. ఈ నేపథ్యంలో మధ్యవర్తులుగా ఉన్న టీడీపీ నాయకులు బోరుబద్ర లోహిదాసు, కోట రామారావులు అడంగళ్ మార్చి 2024 అక్టోబర్ 7న బాలకృష్ణాపురం గ్రామానికి చెందిన బదకల మోహన్‌దాస్(0.35), బతకల డిల్లయ్య(0.40), బతకల చంద్రయ్య(0.55, 0.25), బతకల తులసయ్య(0.55, 0.25), బతకల దుర్గమ్మ(0.94), బతకల మహాలక్ష్మి(0.36), బతకల భనయ్య(ఎకరం) భూములను సెంటు భూమి లేని నూకాల దాలమ్మ, ఇచ్ఛాపురం చెందిన ఆశి సోమేష్, కవిటి మండలానికి చెందిన బెందాళం జయప్రకాష్ వ్యక్తుల పేర్లపై ఆ భూములు 'అనువంశికత' అంటూ రిజిస్ట్రేషన్ చేసినట్లు రైతులు ఆరోపిస్తున్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద భూమి పత్రాలు చూపుతున్న బాలకృష్ణాపురం రైతులు

నా చేత సంతకం పెట్టించారు



నాకు ఏ పాపం తెలియదు. నాకు సెంటు భూమి కూడా లేదు. చదువుకోలేదు. ఇచ్ఛాపురంలో అరటి పండ్లు అమ్ముకొని బతుకుతున్నాను. ఒకరోజు మా సర్పంచ్ వచ్చి తన భూమి నా పేరున మారిందని, వచ్చి సంతకం చేయమంటే చేశాను. ఇప్పుడు నేనే వాళ్లకి ఎకరం భూమి అమ్మినట్లు అధికారులు చెబుతున్నారు. నాచేత సర్పంచ్, రేషన్ డీలర్ కోట రామారావులు ఇదంతా చేయించారు.

- నూకాల దాలమ్మ, బాలకృష్ణాపురం

నాకు తెలియకుండానే ఇదంతా జరిగింది



నా భూమిని చూడటానికి పలాస ఆర్డీఓ వస్తే గానీ నా భూమిని ఎవరో అమ్మేశారని నాకు తెలియలేదు. గొర్రెలు మేపుకొని బతుకుతూ ఉన్న భూమిలో పంట పండించుకుంటూ మా కుటుంబం బతుకుతున్నాము. మా ఊరి నాయకులు బోరుబద్ర లోహిదాసు, కోట రామారావులే మూల కర్తలు. నా భూమి నాకు కావాలి.

- బతకల భనయ్య(మోహనరావు), బాలకృష్ణాపురం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తా..

తమ భూములను కొంత మంది వ్యక్తులు తమ పేరున రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని బాలకృష్ణాపురం గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. సంబంధిత రైతులు, కొనుగోలు చేసిన వ్యక్తులను పిలిపించి విచారిస్తున్నాం. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతాం.



- ఎస్.వెంకటరావు, తహసీల్దార్, ఇచ్ఛాపురం మండలం

మధ్యవర్తిత్వంతో న్యాయ వివాదాల పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయ వివాదాలను త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఒక ప్రభావవంతమైన మార్గమని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారం అనే అంశంపై జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఐదు రోజులు, 40 గంటల శిక్షణ కార్యక్రమం జిల్లా కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ప్రారంభమైంది. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అధ్యక్షతన, జిల్లా వ్యాప్తంగా వివిధ బార్ అసోసియేషన్ల నుంచి ఎంపిక చేసిన పలువురు న్యాయవాదులు ఈ శిక్షణకు హాజరయ్యారు. ఈ శిక్షణలో మధ్యవర్తిత్వం ద్వారా వివాదాలను ఎలా పరిష్కరించాలి, దాని ప్రయోజనాలు, సవాళ్లు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి శిక్షణలు తోడ్పాటు అందిస్తాయని చెప్పారు. సుప్రీం కోర్టు మీడియేషన్, కన్సిలియేషన్ ప్రాజెక్ట్ కమిటీ (ఎంసీపీసీ) సభ్యులు అనూజా సక్సేనా, వీణా రల్లి మాస్టర్ శిక్షకులుగా వ్యవహరిస్తారు



ప్రారంభ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

● మంజునాథుడికి మంచు దుప్పటి



ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో సోమవారం వేకువ జాము నుంచి ఉదయం ఎనిమిది వరకూ దట్టమైన పొగమంచు కమ్ముకుంది. శ్రీముఖలింగం వచ్చిన పర్యాటకులు, యాత్రికులు, భక్తులు ఈ చిత్రాలను వారి సెల్‌ఫోన్‌లలో బంధించి మురిసిపోయారు. - జలుమూరు

3 రోజుల పాటు రథసప్తమి వేడుక



శ్రీకాకుళం పాతబస్టాండ్: అరసవల్లి రథసప్తమి వేడుకలను జిల్లాలో మూడు రోజుల పాటు అంబరాన్ని తాకేలా, జిల్లా పర్యాటకానికి ఊపిరి పోసేలా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. ఫిబ్రవరి 2 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న వేడుకలలో భాగంగా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలసి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా అధి కారులతో కార్యక్రమాల నిర్వహణపై ఆయన సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కూడా పలు సూచనలు చేశారు. తొలి రోజు 80 ఫీట్ రోడ్డు వద్ద ఉదయం 7 గంటలకు సామూహిక సూర్య నమస్కారాలతో వేడుకలు ప్రారంభమవుతాయని, అనంతరం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో వాలీబాల్, కర్రసాము, సంగిడీలు, ఎడ్లుల బండ్ల పోటీలు, వెయిట్ లిఫ్టింగ్ వంటి గ్రామీణ క్రీడలు నిర్వ హిస్తామని చెప్పారు. డచ్ బిల్డింగ్ వద్ద హెలికాప్టర్ టూరిజం ఏర్పాటు చేశామని, 80 అడుగుల రోడ్డు వద్ద వివిధ రకాల స్టాల్స్, అక్కడే ఫుడ్ స్టాల్స్ కూడా అందుబాటులో ఉంటాయని అన్నారు. అలాగే ఏడు రోడ్ల నుంచి అరసవల్లి ఆలయం వరకు ఘనంగా శోభా యాత్ర నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. 80 అడుగుల రోడ్డు వద్ద సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని, రాత్రి 9.30 గంటలకు అక్కడే అద్భుతమైన లేజర్ షో, రాత్రి 10 గంటలకు డచ్ బిల్డింగ్ వద్ద క్రాకర్స్ షో ఉంటాయని అన్నారు. మూడు రోజుల పాటు అరసవల్లి ఆలయంలో సూర్య యాగం ఉంటుందని, ఆలయం వద్ద వివిధ దేవాలయాల మోడళ్లు ప్రదర్శించనున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై హత్యాయత్నం

పాతపట్నం: పాతపట్నం మేజర్ పంచాయతీ దువ్వారివీధికి చెందిన 3వ వార్డు మెంబర్ వైఎస్సార్ సీపీ కార్యకర్త, విలేకరిగా పనిచేస్తున్న పెద్దింటి తిరుపతిరావుపై సోమవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో గుర్తుతెలియ ని వ్యక్తి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం తెల్లవారు జామున మూడు గంటల సమయంలో పెద్దింటి తిరుపతిరావు ఇంట్లో నిద్రిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ఇంటిలోకి చొరబడి తిరుపతిరావు మెడపై కత్తితో దాడి చేశాడు. దీంతో తిరుపతిరావు మెడ, రెండు చేతులపై తీవ్రగాయాలయ్యాయి. తిరుపతిరావు కుటుంబ సభ్యులతో ప్రతి సోమవారం తెల్లవారు జామున మహేంద్రతనయ నది పక్కన ఉన్న నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి వెళతాడని తెలుసుకున్న గుర్తు తెలియని వ్యక్తి ఆ సమయంలోనే దాడి ప్రయత్నించాడు. దాడి చేసినప్పుడు ఆ వ్యక్తి మంకీ టోపి, లుంగీ ధరించి ఉన్నాడని, ఇంటి మేడపై నుంచి ఇంటి వెనుక నుంచి నాగువంశంవీధి వైపు వెళ్లినట్లు పోలీసులకు తిరుపతిరావు తెలిపారు. దాడి జరిగిన వెంటనే తిరుపతిరావును కుటుంబసభ్యులు స్థానిక సీహెచ్‌సీకు తీసుకు వెళ్లి చికిత్స అందించారు. సంఘటన జరిగిన వెంటనే పాతపట్నం సీఐ వి.రామారావు సంఘటన స్థలానికి చేరుకుని, పరిశీలించి, కుటుంబ సభ్యులతో మాట్లాడారు. సీహెచ్‌సీకి వెళ్లి తిరుపతిరావుతో సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి నుంచి వచ్చిన క్లూస్ టీమ్‌తో సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. దువ్వారివీధి, నాగవంశంపు వీధి, మెయిన్ రోడ్డులో ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను క్లూస్ టీం, పోలీసులు పరిశీలిస్తున్నారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. తనకు ఎవరితోనూ వ్యక్తిగత కక్షలు లేవని, రాజకీయ పరంగా శత్రువులు ఇలా చేసి ఉండవచ్చని బాధితుడు తెలిపారు.



ఆస్పత్రిలో తిరుపతిరావు నుంచి వివరాలు సేకరిస్తున్న సీఐ రామారావు

డార్మిటరీ భవనాలు చాలడం లేదు

గార: తమకు డార్మిటరీ భవనాలు చాలడం లేదని, ఒకే గదిలో ఎక్కువ మంది ఉండాల్సి వస్తోందని వమరవల్లి రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థినులు ఏపీఆర్‌ఈఐ సెక్రటరీ వీఎస్ మస్తానయ్య దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం సాయంత్రం వమరవల్లి రెసిడెన్షియల్ స్కూల్‌ను ఆయన సందర్శించారు. డార్మిటరీ, వాష్‌రూమ్‌లు, తరగతి గదులు అన్ని నిశితంగా పరిశీలించారు. గత ప్రభుత్వం నాడు-నేడు కింద చేపట్టిన పనులను సిబ్బంది తెలియజేశారు. ఇంకా భవనాలు చాలకపోవడం వల్ల సెక్షన్ల వారీగా ఒకే గదిలో ఎక్కువ మంది ఉంటున్నారని స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ కిషోర్‌కుమార్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం విద్యార్థినులతో కలసి భోజనం చేశారు. నాణ్యతలో తేడాలుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య వస్తే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని విద్యార్థులు, ఎస్ఎంసీ సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో డీఈఓ డాక్టర్ ఎస్. తిరుమల చైతన్య, ఎంఈఓ వినోదిని తదితరులు పాల్గొన్నారు.



భోజనం చేస్తున్న ఏపీఆర్‌ఈఐ సెక్రటరీ మస్తానయ్య

క్లుప్తంగా

ఆ నేత్రాలు సజీవం


కోటేశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలోని కుశాలపురం పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన పేడాడ కోటేశ్వరరావు (85) సోమవారం మృతి చెందారు. దీంతో కోటేశ్వరరావు కుమారుడు, కుమార్తెలు లక్ష్మణరావు, లక్ష్మి, రాజేశ్వరిలు ఆయన నేత్రాలు దానం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ మేరకు రెడ్‌క్రాస్ సంస్థకు సమాచారం ఇచ్చారు. ఐ టెక్నీషియన్లు సుజాత, ఉమాశంకర్‌లు కార్నియాలు సేకరించారు. విశాఖపట్నంలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి కార్నియాలు చేరవేశారు. జిల్లా రెడ్‌క్రాస్ చైర్మెన్ జగన్మోహన్‌రావు వారిని అభినందించారు.

శ్యామ సుందరస్వామిని తాకిన సూర్య కిరణాలు

టెక్కలి: స్థానిక శ్యామసుందరస్వామి ఆలయంలో సోమవారం స్వామివారిని సూర్య కిరణాలు తాకాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్యామసుందర స్వామిని సూర్యకిరణాలు తాకడంతో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'ఉన్నత లక్ష్యాలు ఉండాలి'


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులు ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధన కోసం నిర్విరామంగా కృషి చేసి ముందుకు సాగాలని సీతంపేట, ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అన్నారు. శ్రీకాకుళంలోని యూత్ ట్రైనింగ్ సెంటర్ వేదికగా కొనసాగుతున్న ఐఐటీ సూపర్ 60 బ్యాచ్ శిక్షణ తరగతలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీఓ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకోవాలని, చదువు మాత్రమే మన జీవితాలను మార్చగలదని గుర్తించాలన్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మురళీబాబు, వైటీసీ ఇన్‌చార్జి, ఫ్యాకల్టీ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారాతో వ్యక్తి అరెస్టు


స్వాధీనం చేసుకున్న నాటుసారా ప్యాకెట్లు

ఇచ్ఛాపురం: ఒడిశా నుంచి 200 నాటుసారా ప్యాకెట్లను తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి పి.దుర్గాప్రసాద్ తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ పరిధిలో దాడులు నిర్వహిస్తుండగా హదియా మోహన్ అనే వ్యక్తి నాటుసారా ప్యాకెట్లను ఒడిశా నుంచి అక్రమ రవాణా చేస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కి తరలించారు.

పలాసలో ఫిస్కాన్ సమీక్ష సమావేశం

కాశీబుగ్గ: పలాస వేదికగా ఫిస్కాన్ (రాష్ట్ర మత్స్యకార సముదాయ సంఘాల నెట్‌వర్క్) శ్రీకాకుళం జిల్లా క్రియాశీలక సమీక్ష సమావేశం సోమవారం నిర్వహించారు. జిల్లాలో ఉన్నటువంటి బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లతో ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో మత్స్యకారులకు సంబంధించిన సమస్యలు, సదుపాయలపై మాట్లాడారు. తీర ప్రాంతం అభివృద్ధిపై వారివారి అభిప్రాయాలు వెల్లడించారు. సమావేశానికి విశాఖపట్నం ఫిస్కాన్ గౌరవ అధ్యక్షుడు శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు సూరాడ రాజారావు, రాష్ట్ర సలహాదారులు కర్రి పండయ్య, రాష్ట్ర డైరెక్టర్ డి.నరసింహులు, జిల్లా కన్వీనర్ పొట్టి వాడు, అర్జిల్లి దాసు, క్రియాశీల సభ్యులు, మత్స్యకార ఐక్యవేదిక నాయకులు అంబటి ఆనందరావు, డోకులపాడు మత్స్యకార నాయకులు అంబటి రామకృష్ణ తదితరులు హాజరయ్యారు.

సభ్యులకు తెలియకుండా అకౌంట్‌లోకి డబ్బులు

టెక్కలి రూరల్: మండలంలోని కొండ భీంపురం గ్రామానికి చెందిన డ్వాక్రా గ్రూపునకు సంబంధించి డ్వాక్రా రుణం డబ్బులు సంబంధిత గ్రూపు సభ్యులకు సమాచారం లేకుండా బ్యాంకు అధికారులు మూడు నెలల క్రితం రూ.17.96 లక్షలు వారి పొదుపు ఖాతాలో జమ చేయడం జరిగింది. అయితే సోమవారం సంబంధిత గ్రూపు సభ్యులకు ఆ డబ్బులకు సంబంధించి వడ్డీ కట్టాలని అధికారులు చెప్పడంతో వారు ఒక్కసారిగా కంగుతిన్నారు. వడ్డీ కట్టేందుకు గ్రూప్ సభ్యులు అంగీకరించకపోవడంతో ఇరువురికి ఇబ్బందులు లేకుండా ఎన్ఆర్‌ఎల్ ఫండ్స్ ద్వారా కట్టేవిధంగా చూస్తామని బ్యాంకు అధికారులు చెప్పారు. అనంతరం గ్రూప్ సభ్యులు అందరూ వారికి నూతనంగా ఒక్కొక్కరూ రూ.2 లక్షల చొప్పున లోన్ పెట్టేందుకు పత్రాలు ఇవ్వడంతో ఈ సమస్య పరిష్కారమైనట్లు ఏపీఎం ఉమారాణి తెలిపారు.

వర్సిటీలపై నిఘా..!

- సొంత నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశాలు
- ఈనెల 20లోపు నివేదిక కోరిన ఉన్నత విద్యా మండలి
- బీఆర్ఏయూలో చర్చనీయాంశం


డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీల పాలన, అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అధికారులు తమకు తెలియకుండా, పాలక మండలిలో అనుమతులు తీసుకోకుండా ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది. ఈనెల 10వ తేదీన అన్ని వర్సిటీలకు ఈ మేరకు ఉత్తర్వులు అందజేసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తీసుకున్న నిర్ణయాలపై నివేదిక అందజేయాలని స్పష్టం చేసింది. ఈ నివేదికను ఈనెల 20వ తేదీలోపు మెయిల్ ద్వారా అందజేయాలని సూచించింది. ప్రస్తుతం ఈ నిర్ణయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో చర్చనీయాంశంగా మారింది. కూటమి నాయకులు, ప్రజా ప్రతినిధుల మెప్పు పొందేందుకు, తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం అధికారులు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉన్నత విద్యా మండలి నివేదిక కోరడంతో ఎటువంటి నివేదిక అందజేస్తారో చూడాల్సి ఉంది. మరో పక్క అధికారులు తీసుకున్న నిర్ణయాలపై విశ్వవిద్యాలయం పరిరక్షణ కమిటీ పేరుతో తరచూ ఉన్నత విద్యాశాఖ, గవర్నర్ కార్యాలయం, ఉన్నత విద్యా మండలికి ఫిర్యాదులు అందుతున్నాయి.

సమావేశాల ఊసేలేదు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో రెగ్యులర్ పాలక మండలి సమావేశాలు 2022 నవంబర్ తర్వాత జరగలేదు. గతేడాది సెప్టెంబర్‌లో అధికారులు తీవ్రంగా ప్రయత్నించినా ఉన్నత అధికారులు ఈసీ సమావేశానికి అనుమతి ఇవ్వలేదు. దీంతో అధికారులు సొంతంగా నిర్ణయాలు తీసుకుంటూ ముందుకు సాగుతున్నారు. పాలక మండలి అనుమతి లేకుండా సీఏఎస్ (కెరీర్ అడ్వాన్స్ స్కీమ్) ఇంటర్వ్యూను డిసెంబర్ 30న రహస్యంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. విశాఖపట్నంలోని ఒక హోటల్‌లో కమిటీ సభ్యులను ఉంచి, వారిని వర్సిటీకి తీసుకొచ్చేందుకు కార్లు సిద్ధం చేశారు. అయితే చివరి క్షణంలో ఉన్నత విద్యాశాఖ ఈ ఇంటర్వ్యూలను రద్దు చేయాలని అధికారులకు సూచించింది. ఒక ప్రొఫెసర్‌కు సీనియర్ ప్రొఫెసర్‌గా ఉద్యోగోన్నతి, ఐదుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతికి సంబంధించిన ఈ ప్రక్రియ నిలిచిపోయింది. అర్హత, నిబంధనలు వంటి అంశాలు పట్టించుకోకుండా అధికారులు ముందుకు సాగారన్న అంశాన్ని ఉన్నత విద్యాశాఖ భావించి ఈ ఇంటర్వ్యూలను అడ్డుకుంది. మరో పక్క వర్సిటీకే సీనియర్ ప్రొఫెసర్‌ను మాత్రం సీఏఎస్‌కు పరిగణలోకి తీసుకోలేదు. విశాఖపట్నంలోని ఒక ప్రైవేట్ వర్సిటీలో అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసరుగా పనిచేసిన అనుభవంతో అసోసియేట్ ప్రొఫెసర్‌గా వర్సిటీలో చేరినా, ప్రైవేట్ సంస్థ సర్వీస్‌ను రెగ్యులర్‌గా భావించడం సైతం సీఏఎస్‌లో సమస్యగా మారింది.

కూటమి వచ్చాక...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా అధికారులు ప్రజాప్రతినిధులు, నాయకుల సిపార్సులు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం నియామకాలు చేపట్టారు. పాలక మండలి అనుమతి లేకుండానే ఈ నిర్ణయాలు జరిగాయి. 21 కాంట్రాక్టు అధ్యాపకులు, 8 నాన్ టీచింగ్ స్టాఫ్, ఇద్దరు ఇంజినీర్లు వంటి నియామకాలు చేపట్టారు. మరో పక్క లక్ష వేతనంకు ఎటువంటి నోటిఫికేషన్ సైతం లేకుండా ప్రత్యేక అధికారిని నియమించారు. ఈమెకు ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల తొలగింపు



గతేడాది జనవరి 1వ తేదీన అప్పటి వీసీ 34 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను నియమించారు. ఈ ఉద్యోగాలకు సంబంధించి గుంటూరు జిల్లా తాడేపల్లి చెందిన ఏజీఎస్ సర్వీసెస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు. 151 జీవో మేరకు మూడేళ్ల అగ్రిమెంట్ ఉండగా, ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా గతేడాది డిసెంబర్ 31వ తేదీన వీరిని తొలగించారు. ప్రస్తుతం వీరు లేబర్ కోర్టులో పోరాటం చేస్తున్నారు. తొలగింపునకు ఎటువంటి పాలక మండలి అనుమతి తీసుకోలేదు.

ట్రాన్స్‌పోర్టు పేరుతో భారీగా ఖర్చు



యూనివర్సిటీలో ట్రాన్స్‌పోర్టు పేరుతో భారీగా ఖర్చు చేస్తున్నారు. 15 ఏళ్ల కాలం చెల్లిన కార్లు రెండు ఉండగా, ఇందులో ఒక కారు అధికారి వ్యక్తిగత అవసరాలు, కుటుంబ సభ్యుల కోసం వినియోగిస్తున్నారు. అవసరం లేకుండా లీజ్ కారు ఓ అధికారి కోసం వినియోగిస్తున్నారు. వర్సిటీ ఉద్యోగిగా హెచ్‌ఆర్‌ఏ తీసుకుంటున్న అధికారి విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వర్సిటీకి రోజూ రాకపోకల కోసం ప్రభుత్వ కారు వినియోగిస్తున్నారు. వాస్తవంగా 2017 ప్రభుత్వ జీవో ప్రకారం నెలకి రూ.35,000లకు మించి ట్రాన్స్‌ఫోర్టుకు ప్రభుత్వ అధికారి వినియోగించకూడదు. వాహనం రీడింగ్ సైతం లాగ్ బుక్‌లో రిజిస్టర్ చేయాలి. కానీ అలా జరగడం లేదు. ఇలా లక్షల్లో వర్సిటీ డబ్బు ట్రాన్స్‌ఫోర్టు రూపంలో తప్పుడు డీజిల్, పెట్రోల్ బిల్లుతో దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. ఆర్థిక పరమైన నిర్ణయాలు, భవన నిర్మాణాలకు కోట్లతో బిల్లులు చెల్లింపులు, వర్సిటీ అంతర్గత నిధులు వినియోగం వంటివి చాలా వరకు ఉన్నాయి. ప్రభుత్వ బ్లాక్ గ్రాంట్‌తో సంబంధం లేకుండా అంతర్గత నిధులు ఖర్చుకు పాలక మండలి అనుమతి ఉండాలి, కానీ ఎటువంటి అనుమతి లేకుండా ఖర్చు చేస్తున్నారు.

దర్యాప్తు ముమ్మరం

- వివాహిత హత్య కేసుకు సంబంధించి విచారణ
- పోలీసుల అదుపులో అనుమానితుడు


మీడియాతో మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలోని న్యూకాలనీ సమీపంలో ఒక బిల్డింగ్ ఫైఫ్లోర్ బాత్రూమ్‌లో ఆదివారం రాత్రి పొందూరు మండలం మొదలవలస గ్రామానికి చెందిన పూజారి కళావతి అనే మహిళ మృతదేహం బయటపడిన విషయం విధితమే. ఆమె దారుణ హత్యకు గురైనట్లు, ఆ దిశగా దర్యాప్తు కొనసాగించిన రెండో పట్టణ పోలీసులు కీలక అనుమానితుడైన శరత్‌కుమార్‌ను సోమవారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్న పోలీసులు తమ ప్రాథమిక దర్యాప్తులో అనేక విషయాలు తెలుసుకుంటున్నారు. ఒకట్రెండు రోజుల్లో కేసు కొలిక్కి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

అన్ని కోణాల్లో విచారణ

ఇప్పటికే హత్య జరిగిన సమీప ప్రాంతాల్లో సీసీ కెమెరాలను, అనుమానితుడు, మృతురాలి సీడీఆర్‌లను ఇప్పటికే క్షుణ్ణంగా పరిశీలించారు. ఆదివారం రాత్రి 12:30 ప్రాంతంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సైతం ఘటనాస్థలికి చేరుకొని బాత్రూమ్‌లో ఉన్న మృతదేహాన్ని పరిశీలించి హత్య జరిగిన తీరుపై ఆరా తీశారు. కేసును అన్ని కోణాల్లో చాలా సీరియస్‌గా తీసుకుని ఛేదించాలని సూచించారు. అనుమానితుని సీడీఆర్ ఆధారంగా ఈ రెండు రోజుల్లో అతనితో టచ్‌లో ఉన్న కొంతమందిని సోమవారం ఉదయం పోలీసులు విచారణకు పిలిచారు.

పోలీసులకు ఆధారాలు..?

ఇదిలా ఉండగా సోమవారం ఉదయం హత్య జరిగిన బిల్డింగ్‌కు డీఎస్పీ సీహెచ్ వివేకానంద, రెండో పట్టణ సీఐ ఈశ్వరరావులు వెళ్లి గదిని, బాత్రూమ్‌ను, వస్తువులను పరిశీలించారు. అనంతరం డీఎస్పీ వివేకానంద మీడియాతో మాట్లాడారు. కళావతి ఈనెల 18న నగరానికి స్కూటీపై రావడం.. చైతన్య కళాశాల వద్ద స్కూటీపెట్టి నడుచుకుంటూ వచ్చి బిల్డింగ్ పైనున్న గదికి మెట్లు ఎక్కి రావడం నిజమేనన్నారు. సమీప సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైందన్నారు. హత్య జరిగిన గదిలో కరెంట్ జనరేటర్ల మెకానిక్‌గా పనిచేస్తున్న శరత్‌కుమార్ ఉంటున్నట్లు తెలిసిందన్నారు. అయితే ఆమె ఈ గదికి ఎందుకు వస్తున్నదీ.. అతనికి, ఆమెకు ఉన్న సంబంధమేంటన్నదానిపై విచారణ చేస్తున్నామని పేర్కొన్నారు. ఇదివరకు కూడా మూడు, నాలుగు సార్లు ఆమె ఇక్కడికి వచ్చినట్లు ఆధారాలు లభించాయన్నారు. కళావతి భర్త వెంకటరావు తమకు ఇచ్చిన ఫిర్యాదులో బంగారం గాజులు, ఉంగరాలు, మెడలో గొలుసులు కనిపించలేదని అన్నారని, ఆ దిశగా కూడా దర్యాప్తు చేస్తున్నామన్నారు. అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నామని, సైంటిఫిక్, టెక్నికల్ ఎవిడెన్సులు, సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామన్నారు.

అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- మీకోసంలో 91 అర్జీల స్వీకరణ


అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పెండింగ్‌లో ఉండకూడదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక(మీకోసం)లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అర్జీలను సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే అర్జీల సత్వర పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కార్యాలయంలో ఒక అర్జీల మానిటరింగ్ అధికారిని, ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను ఏర్పాటు చేసుకొని, వచ్చే అర్జీలపై పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు. మానిటరింగ్ అధికారి ప్రతిరోజూ సమీక్షిస్తుండాలని పేర్కొన్నారు. వారం లేదా రెండు వారాలకు ఒకసారి జిల్లా అధికారి అర్జీలపై సమీక్ష చేసుకుంటే పరిస్థితి తెలుస్తుందన్నారు. అర్జీదారునికి ఖచ్చితమైన సమాచారం అందజేయాలన్నారు. మీకోసంలో మొత్తం 91 అర్జీలు స్వీకరించగా వీటిలో రెవెన్యూ, పంచాయతీ రాజ్, సర్వే అండ్ లాండ్ రికార్డులు, ఏపీ టౌన్‌షిప్, ఏపీ హౌసింగ్, ఏపీఈపీడీసీఎల్, పశుసంవర్ధక శాఖ, స్కిల్ డవలప్‌మెంట్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, విభిన్న ప్రతిభావంతులు, గ్రామీణాభివృద్ధి, వాటర్ రిసోర్సెస్, స్కూల్ ఎడ్యుకేషన్, ఏపీ స్కిల్ డవలప్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, దేవదాయ శాఖ, మైన్స్ అండ్ జియాలజీ తదితర శాఖలకు సంబంధించి వినతులు ఉన్నాయి. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డిప్యూటీ కలెక్టర్ పద్మావతి, జెడ్పీ సీఈవో శ్రీధర్ తదితరులు ఉన్నారు.

ఫిర్యాదులకు ప్రాధాన్యమివ్వాలి

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ, పరిష్కారానికి ప్రాధాన్యతనివ్వాలని ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి చట్టప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. సోమవారం 58 మంది అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. వృద్ధులు, వికలాంగుల అర్జీదారుల వద్దకు స్వయంగా వెళ్లి వారి గోడు విన్నారు.


వృద్ధుడి గోడు వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రిమ్స్‌లో రికార్డు స్థాయిలో ఓపీ


రిమ్స్‌లో ఓపీ రిజిస్ట్రేషన్ కోసం బారులు తీరిన రోగులు

శ్రీకాకుళం: శ్రీకాకుళం రిమ్స్ వైద్యశాలకు సోమవారం రికార్డుస్థాయిలో అవుట్ పేషెంట్లు వచ్చారు. సోమవారం 958 మంది రోగులు చికిత్సల కోసం రావడంతో రిమ్స్ ఆవరణ కిటకిటలాడింది. సాయంత్రం 4 గంటలతో ఓపీ రిజిస్ట్రేషన్ ముగియాల్సి ఉండగా సాయంత్రం 6.30 గంటల వరకు కొనసాగించారు. ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వైద్యులు యథావిధిగా మధ్యాహ్నమే వెళ్లిపోగా స్థానిక వైద్యులు సాయంత్రం 6.30 గంటల వరకు ఓపీ చూశారు. పలువురికి రక్తపరీక్షలు, స్కానింగ్‌కు సిఫార్స్ చేయడంతో వారు మంగళవారం మళ్లీ రిమ్స్‌కు వచ్చే పరిస్థితి ఏర్పడింది.

51 మంది దివ్యాంగులకు సదరంలో పరీక్షలు

పింఛన్ పొందుతున్న 51 మంది దివ్యాంగులకు రిమ్స్ వైద్యులు సదరంలో పునఃపరీక్షలు నిర్వహించారు. మండలస్థాయికి వెళ్లి పునఃపరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నప్పటికీ చెవి, కళ్లు, మానసిక వైకల్యం కలిగిన వారిని పరీక్షించేందుకు యంత్రాలు అవసరమని, వాటిని మండల స్థాయికి తరలించే అవకాశం ఉండదని, రిమ్స్ వైద్యులు రాష్ట్ర స్థాయికి నివేదించడంతో వారిని రిమ్స్‌కు పిలించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో ఆదివారం రాత్రి ఈ మూడు విభాగాలకు చెందిన దివ్యాంగులను రిమ్స్‌కు రావాలని సమాచారం అందించారు. ఎముక విభాగానికి సంబంధించిన వైద్యులు మండల స్థాయికి వెళ్లి పరీక్షలు జరుపుతున్నారు.

తీరానికి తరుణ్ మృతదేహం

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు సముద్ర తీరంలో ఈనెల 17వ తేదీన స్నానానికి వెళ్లి గల్లంతైన జంగం తరుణ్ మృతదేహం సోమవారం కొత్తపేట తీరానికి చేరింది. తోటి స్నేహితులతో కలిసి వజ్రపుకొత్తూరు బీచ్‌లో స్నానం చేస్తుండగా అలల్లో చిక్కుకుని తరుణ్ గల్లంతైన విషయం తెలిసిందే. ఐతే గత నాలుగు రోజులుగా బంధువులు, కుటుంబ సభ్యులు, పోలీసులు తీరం వెంబడి గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో సోమవారం అలల ఉధృతికి కొత్తపేట తీరానికి మృతదేహం చేరుకోవడంతో, గుర్తించిన స్థానిక మత్స్యకారులు పోలీసులకు సమాచారం అందించారు. కొత్తపేట తీరానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించిన ఎస్ఐ బి.నిహార్ వజ్రపుకొత్తూరులోని మృతుని తల్లిదండ్రులు జంగం హేమంత్, సుమతిలకు సమాచారం ఇచ్చారు. కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆరోగ్యశ్రీని అటకెక్కించేశారు

- వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త రవికుమార్ ధ్వజం


మాట్లాడుతున్న చింతాడ రవికుమార్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పేదలకు ఎంతగానో ఉపయోగపడే ఆరోగ్యశ్రీ పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించేసిందని వైఎస్సార్‌సీపీ ఆమదాలవలస సమన్వయకర్త చింతాడ రవికుమార్ ధ్వజమెత్తారు. శ్రీకాకుళం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ లేకపోవడంతో ప్రతిరోజూ వేలాది మంది పేద రోగులకు వైద్యం అందక, ఆర్థిక స్తోమత లేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సుమారుగా 3,500 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆస్పత్రుల్లో సైతం ఉచిత వైద్యసేవలు అందించేవారని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఈ పేదల పథకాన్ని నిర్వీర్యం చేసిందని మండిపడ్డారు. ఆరోగ్యశ్రీ ట్రస్టుకు ఈ ప్రభుత్వం గడచిన ఏడు నెలలుగా సుమారుగా రూ.3,300 కోట్లు బకాయి పడిందని తెలిపారు. దీంతో ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కేసులకు వైద్యం అందించడంలో వెనుకంజ వేస్తున్నారన్నారు. అంతే కాకుండా ఆరోగ్యశ్రీ ట్రస్టు నుంచి అనుమతులు కూడా రావడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని కేసులను తీసుకోకుండా బయటకు పంపించేస్తున్నారన్నారు. ఆమదాలవలస మండలానికి చెందిన ఒక వ్యక్తి ఈనెల 11న ప్రమాదానికి గురైతే ఆస్పత్రిలో చేర్పించారని, కానీ ఆయనకు ఇప్పటికీ ఆరోగ్యశ్రీ అనుమతులు రానందున శస్త్ర చికిత్స జరగలేదన్నారు. గడచిన పది రోజులుగా ఆయన సొంత ఖర్చులతో వైద్యం పొందుతున్నాడని, పేదలు ఈ పరిస్థితి వలన చాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

దారికాచిన మృత్యువు



జాతీయ రహదారిపై ప్రమాదం జరిగిన దృశ్యం

- రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం
- మరో వ్యక్తికి తీవ్రగాయాలు
- స్నేహితుడిని డ్రాప్ చేసి తిరిగి వస్తుండగా ఘటన

కంచిలి, సోంపేట: మండలంలోని జలంత్రకోట గ్రామ కూడలి వద్ద జాతీయ రహదారిపై సోమవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సోంపేట మండలంలోని బారువ గ్రామానికి చెందిన హరీష్‌కుమార్ పాణిగ్రాహి(31), అనిల్‌కుమార్ పాణిగ్రాహిలు కంచిలి నుంచి కారులో బారువ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకొంది. ఈ ప్రమాదంలో హరీష్‌కుమార్ పాణిగ్రాహికు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అనిల్‌కుమార్ తీవ్రగాయాలపాలయ్యాడు. అనిల్‌ను వెంటనే సోంపేట ప్రభుత్వ ఆస్పత్రికి హైవే అంబులెన్స్‌లో తరలించి, ప్రథమ చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం టెక్కలి, తర్వాత శ్రీకాకుళం, అక్కడి నుంచి విశాఖపట్నం తరలించారు. మృతుడు హరీష్, అనిల్‌లు కంచిలికి చెందిన తమ స్నేహితుడు నర్తు రాజేష్‌ను పలాస రైల్వేస్టేషన్ పికప్ చేసుకొని కంచిలిలో డ్రాప్ చేశారు. అనంతరం తమకు చెందిన కారులో కంచిలి నుంచి బారువ వస్తుండగా, పొగమంచు కారణంగా ఎదురుగా వస్తున్న టిప్పర్ లారీ కనిపించకపోవడంతో ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ చేస్తున్న హరీష్ అక్కడికక్కడే మృతిచెందాడు. అనిల్ తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.


హరీష్‌కుమార్ (ఫైల్)

అంతలోనే ఘోరం

బారువ గ్రామానికి చెందిన రోజారాణి కుమారుడు హరీష్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. వర్క్‌ఫ్రమ్ హోమ్ నేపథ్యంలో రెండు నెలలుగా ఇంటి దగ్గర నుంచే ఉద్యోగం చేస్తున్నాడు. సంక్రాంతి పండగ ముగియడంతో సోమవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లడానికి సిద్ధమయ్యాడు. ఇంతలోనే ఘోరం జరిగిపోయింది. హైదరాబాద్ వెళ్లాల్సిన కుమారుడు రహదారి ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి వేదన వర్ణనాతీతం. రోజారాణి భర్త చాలా రోజుల క్రితం పిల్లలను, భార్యను విడిచిపెట్టి వెళ్లిపోయాడు. దీంతో పిల్లలే తన సర్వస్వంగా భావించి విద్యాబుద్ధులు నేర్పించింది. దీనిలో భాగంగా హరీష్ చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా స్థిరపడ్డాడు. అనంతరం అతడు తన తమ్ముడు శిరీష్, చెల్లెలు శ్వేతను ప్రయోజకులను చేశాడు. సోదరి శ్వేత బారువ స్టేట్‌బ్యాంకులో ఉద్యోగినిగా విధులు నిర్వహిస్తోంది. సోదరుడు స్థానిక షిరిడిసాయి ఆలయంలో అర్చకుడిగా చేస్తున్నాడు. హరీష్‌కు త్వరలోనే వివాహం చేయాలని నిశ్చయించగా, ఇంతలోనే ఇలా మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులంతా దుఃఖ సాగరంలో మునిగిపోయారు. హరీష్ తల్లి ప్రమాదం జరగడానికి ముందే ఫోన్‌చేస్తే పావుగంటలో ఇంటికి వస్తున్నానని చెప్పాడు. అంతలోనే కొడుకు మృతి చెందడంతో ఆమెను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.

పాలఖండ్యాంలో పశువుల కాపరి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పోలారావు

జి.సిగడాం: మండలంలోని పాలఖండ్యాం గ్రామానికి చెందిన బత్తుల పోలారావు(50) సోమవారం సాయంత్రం మినీ వ్యాన్ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాజాం-శ్రీకాకుళం ప్రధాన రహదారిలో మెట్టవలస-పాలఖండ్యాం గ్రామ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంకు వద్ద పశువులను కాపు కాస్తూ ఉండగా వేగంగా వచ్చిన వ్యాన్ ఢీకొంది. దీంతో ఘటన స్థలంలోనే పోలారావు మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ఆదిలక్ష్మి, కుమార్తెలు పూజిత, ఇంద్రజ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు. మృతదేహాన్ని రాజాం సామాజిక ఆస్పత్రికి తరలించామన్నారు. ఘటన స్థలానికి సర్పంచ్ ధారబోయిన ధర్మారాజ్, మాజీ సర్పంచ్ పలిశెట్టి సూర్యనారాయణ, ఉప సర్పంచ్ ఇజ్జి గోవిందరావు, అరుణోదయ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ గర్లంకి శ్రీనివాసరావు తదితరులు వెళ్లి సంతాపం తెలిపారు. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.